అప్పు చేసి పప్పు కూడు..!

- అంగన్‌వాడీ కేంద్రాలకు సవ్యంగా అందని సరకులు
- కంది పప్పు సరఫరాకు కత్తెర వేసిన ప్రభుత్వం
- పక్క కేంద్రాల నుంచి అప్పు తెచ్చుకుంటున్న నిర్వాహకులు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందని పౌష్టికాహారం
- కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం


కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

విశాఖ విద్య : మాతా – శిశు మరణాల నివారణలో అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో కీలకపాత్ర వహిస్తాయి. కేంద్రాల నుంచి అందించే పౌష్టికాహారం నిరుపేద గర్భిణులు, తల్లులు, చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అందుకని ఆయా కేంద్రాలను బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. ప్రస్తుతం కేంద్రాలకు పౌష్టికాహారం సరకులు సవ్యంగా సరఫరా కావడం లేదు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని కేంద్రాలకు ఆగస్టు నెలకు సంబంధించిన కంది పప్పు ఇవ్వలేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. ఫ్రీ స్కూల్ నిర్వహిస్తున్నందున కేంద్రాలకు చిన్నారుల ఆర్తాకలి చూడలేక, అంగన్‌వాడీ కార్యకర్తలు కందిపప్పు వేరే చోట నుంచి అప్పు తెచ్చి పిల్లలకు పప్పన్నం పెడుతున్నారు. ఈ పరిణామాలు కేంద్రాల కార్యకర్తలపై మరింత ఆర్థిక భారాన్ని పెంచుతున్నాయి.

కందిపప్పులో కోత

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు నెలకు సంబంధించిన సరకులన్నీ జూలై నెల ఆఖరిలోనే సరఫరా చేయాల్సి ఉంది. కానీ కందిపప్పు ప్యాకెట్లను కొన్ని కేంద్రాలకు అరకొరగా పంపిణీ చేయగా, మరికొన్నింటికి అసలు ఇవ్వలేదు. ఈ విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, సరకుల సరఫరా వ్యవహారం రాష్ట్ర స్థాయిలో జరుగుతుండటంతో వారు కూడా ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. ఈ పరిస్థితుల్లో కందిపప్పు లేకుండా, మిగతా సరకులు అందిస్తున్నారు.

గాడి తప్పుతున్న నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతీ నెలా ఒక్కొక్కరికి మూడు కేజీల బియ్యం, ఒక కేజీ కంది పప్పు, అర కేజీ నూనె, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కేజీల రాగి పిండి, అర కేజీ పప్పు చెక్క, అరకేజీ బెల్లం, ఒక కేజీ అటుకులు పంపిణీ చేస్తారు. ప్రతీ కేంద్రంలో నమోదైన గర్భిణులు, బాలింతలు, పిల్లల సంఖ్య మేరకు ప్రతీ నెలా ఆఖరి వారంలో తదుపరి నెలకు సంబంధించిన సరకులు సరఫరా చేస్తారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరకులు సకాలంలో సరఫరా కావడం లేదు. కోడిగుడ్లు సైతం చిన్న సైజువి ఇస్తుండగా, అవి కూడా కుళ్లినవి సరఫరా చేస్తుండడంతో లబ్ధిదారులు కేంద్రాల నిర్వాహకులను నిలదీస్తున్నారు.

సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం

మరోవైపు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్నికలకు ముందు రిలే దీక్షలు చేపట్టారు. వేతనాలు పెంచాలని, కేంద్రాలకు సంబంధించిన అద్దె బకాయిలు సకాలంలో చెల్లించాలని, ఇతర నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని డిమాండ్లతో ధర్నా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారంపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. మాతా శిశు సంరక్షణలో కీలకంగా పనిచేసే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఉన్నత స్థాయి సమీక్ష కూడా లేకపోవడంతో ప్రస్తుతం కేంద్రాలు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి.

> **ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం**
>
> అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు నెలకు సంబంధించి కందిపప్పు సరఫరా కాలేదు. అయినప్పటికీ కేంద్రాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. గతంలో మిగులున్న స్టాక్‌ను వినియోగించుకోవాలని కేంద్రాల కార్యకర్తలకు చెప్పాం. ఒక కేంద్రంలో ఎక్కువ నిల్వ ఉంటే, దాన్ని మరో కేంద్రానికి సర్దుబాటు చేస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.
>
> – జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


ఆవుదూడకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు గురువారం వేశారు. ఈ కార్యక్రమం సెప్టెంబరు 19వ తేదీ వరకు గాంధీగ్రామం పశువులు ఆసుపత్రి పరిధిలో ఉన్న అన్ని వార్డులోని పశువులకు ఉచితంగా గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యశాల డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులు నోటిలో, కాళ్ల మధ్య కురుపులు వచ్చి మేతమేయలేక నీరసించి పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. కార్యక్రమాన్ని జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపట్నం : మద్రిపాలెం వుడా లే అవుట్ జర్నలిస్టు కాలనీ ఫీడర్ శాంతినగర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు కాలనీ ఫీడర్ పరిధిలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయం ఏరియా, ఎస్‌ఏడీ, గౌరీనగర్, గణేష్‌నగర్, శాంతినగర్ ఫీడర్ పరిధి అంబేడ్కర్‌నగర్, శాంతినగర్, నేతాజీనగర్, గురజాడ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

అభివృద్ధికి ఎన్‌ఎస్‌టీఎల్ సహకరించాలి

విశాఖ విద్య : ఎన్‌ఏడీ ప్రాంత అభివృద్ధి దృష్ట్యా 90వ వార్డు పరిధిలోని సమస్యల పరిష్కారానికి ఎన్‌ఎస్‌టీఎల్ నుంచి సహకారం అందించాలని కార్పొరేటర్ బొమ్మిడి రమణ కోరారు. గురువారం ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ వర్గీస్ అబ్రహంను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 90వ వార్డు పరిధిలో ఎన్‌ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేట్ వద్ద యుద్ధ పరికరాల ప్రదర్శనశాల ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇది ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సరవ పైడిరాజు, యలమంచిలి కిశోర్, నమ్మి లావణ్య కుమార్, గోపి పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ


మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న కలిదిండి బద్రీనాథ్ తదితరులు

సింధియా : జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ గ్రామంలో ఉన్న మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ ప్రెసిడెంట్ సూరాడ పెంటారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్, బోని ఈశ్వర రావు, అదపాక అప్పారావు, అనిల్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం నగరంలోని కంచరపాలేనికి చెందిన ఎ.కనకరత్నం కుటుంబ సభ్యులు లక్షా 116 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై దాతకు బాండ్‌ను ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతికి ఆశ్రయం


ఏయూటీడీ వసతి గృహంలో ఆశ్రయం పొందిన యువతి

సీతమ్మధార : పేరు, ఊరు పేరు చెప్పలేని నిస్సహాయ స్థితిలో ఉన్న ఒక యువతిని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో మతిస్థిమితం లేని ఒక యువతిని గుర్తించిన వ్యక్తులు ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి గురువారం తరలించారు. గతంలో కూడా ఈమెకు ఇక్కడ ఆశ్రయం కల్పించగా.. పారిపోయిందని నిర్వాహకులు తెలిపారు. ఈమె ఇతరులను దుర్భాషలాడుతోందని... కొన్ని రోజులు యువతి పరిస్థితి గమనించి చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి తరలిస్తామని ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న బాబా


సాయి సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం పంచామృతాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. సాయంత్రం బాబా వారికి పంచహారతులు ఇచ్చారు. సాయి సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రత్యేక హారతులు ఇచ్చిన తరువాత పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ రావు, కోశాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గోపాలపట్నం పరిసరాల్లో జోరువాన


కొత్తపాలెంలో కురుస్తున్న వర్షం


బాజీ జంక్షన్ నుంచి పాత గోపాలపట్నం వెళ్లే రోడ్డుపై గోతిలో నిలిచిపోయిన వర్షపు నీరు

గోపాలపట్నం : గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం జోరువాన కురిసింది. సుమారు 20 నిమిషాల సేపు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ద్విచక్ర వాహనదారులు ఎక్కడి వారక్కడే నిలిచిపోయి నీడ కోసం పరుగులు తీశారు. ఉదయం నుంచి మబ్బుగా ఉన్నా మధ్యాహ్నమయ్యేసరికి వర్షం కురిసింది. ఈ వర్షంతో ఉపశమనం పొందామని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. బాజీ జంక్షన్ నుంచి పాత గోపాలపట్నం వెళ్లే దారిలో వర్షం వల్ల రహదారి చెరువును తలపించింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. నీరు నిల్వ ఉండి పోవడంతో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక భయపడుతూ రాకపోకలు సాగించారు. సంబంధిత అధికారులు స్పందించి గోతులమయమైన రహదారిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికులపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలి

మహాధర్నాలో స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకుల డిమాండ్


ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముందు ధర్నా చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులపై యాజమాన్యం బలవంతపు ఆర్థిక ఆంక్షలు ఉపసంహరించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. యాజమాన్యం కార్మికుల పట్ల అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేతకాని వైఖరి వల్ల పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నడపలేకపోతున్నారన్నారు. ముడి పదార్థాలు సమకూర్చలేని పరిస్థితిలో యాజమాన్యం ఉండడం సిగ్గుచేటన్నారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే ప్లాంట్ మనుగడ సాధిస్తుందన్నారు. అదే విధంగా నిర్వాసితుల ఉపాధి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

వేతనాలు పెంచకపోగా.. కోతలా!

సెయిల్‌తో సమానంగా వేతన సవరణ జరగాల్సి ఉండగా ఇక్కడ ఉన్న వేతనాలపై ఆంక్షలు విధించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఉక్కు యాజమాన్యం ప్రతీ నెలా సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు ఆర్థిక ఆంక్షల ప్రతిపాదనను విరమించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లోకి నాయకులు వెళ్లకుండా పెద్ద ఎత్తున పోలీసు సిబ్బందిని మోహరించారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. ధర్నాలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభకు ప్రోత్సాహం

కంచరపాలెం: విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే దిశగా జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పనిచేస్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథా వాచనం మొదలగు ప్రతిభా పోటీలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రమాణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షైజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతోపాటు ప్రతిభను ప్రదర్శించడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. సుమారు 10 కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వి.ఎస్.కృష్ణ, డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, పి.రమణిలత, వసంత, సరోజ్‌కుమారి, కో–ఆర్డినేటర్లు జోషిత, దీపిక, నవ్యశ్రీ, రమ్యసాయి, చంద్రిక, డాక్టర్ టి.భాస్కరసుధ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతోనే అభివృద్ధి

సీతమ్మధార : విశాఖపట్నం అభివృద్ధిలో గ్రంథాలయాలూ ముఖ్యమేనని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి మీద అత్యంత ప్రధానమైనది గ్రంథాలయమన్నారు. ఇక్కడకు ఎన్నిసార్లు వెళ్తే అన్ని కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత గ్రంథాలయానికి వెళ్లడం మానేయడం సరికాదని హితవు పలికారు. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు పాత పేపర్లు సాధన చేయడం ద్వారా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ గ్రంథాలయంలో ఎన్నో వేల గ్రంథాలు, మంచి సదుపాయాలున్నాయని నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

దాబాగార్డెన్స్: పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత లేకుండా పోతోందని, మహిళల భద్రతకు తక్షణం ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం కార్యదర్శి ఆర్.వసంతరావు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్భయ చట్టం ఉన్నప్పటికీ మహిళలపై ఇటువంటి దాడులు జరగడం హేయనీయమన్నారు. చట్టాలను కఠినంగా అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో మహిళలపై దాడులు నిరోధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ సంఘం నాయకులు కమలాకర్, ఆడారి శ్రీను, రమేష్, ఈశ్వర్, ప్రసాద్, సుజాత, ప్రత్యూష, ప్రసన్న లక్ష్మి, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకం


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ జగదీశ్వరరావు

మల్కాపురం : పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ముఖ్య భూమిక పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ జగదీశ్వరరావు సూచించారు. ఈ మేరకు గురువారం హెచ్‌పీసీఎల్‌లోని ఎల్ అండ్ టీ సంస్థ ఐఈటీపీ విభాగం ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని ప్రైవేట్ స్కూళ్లకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన కొన్ని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో మార్పులు కారణంగా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా భూగర్భ జలాల రక్షణకు కాలుష్యరహిత వాతావరణానికి మొక్కలు విరివిగా నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ సంస్థ ఐఈటీపీ విభాగం ప్రాజెక్ట్ మేనేజర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతను అలవాటు చేద్దాం


గోపాలపట్నం హైస్కూల్‌లో బ్యానర్ ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం : చేతులు శుభ్రం చేసుకునేలా విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని ఎంఈవో దివాకర్ సూచించారు. ఈ మేరకు గురువారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల ద్వారా వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా కడుక్కునేలా చిన్ననాటి నుంచే అలవాటు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎంపిక చేసిన 100 పాఠశాలల్లో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆటలు, టాయిలెట్లకు వెళ్లి వచ్చిన తర్వాత విధిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ప్రత్యేకంగా రూపొందించిన మెటీరియల్స్‌తో అవగాహన కల్పించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలల్లో ప్రపంచ వాష్ డే, ప్రపంచ టాయిలెట్ డేను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె.నాగంద్ర జోగి, డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రతినిధులు ఏఎస్ కుమారి, ఎం.పుల్లన్న, గోడె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలే విద్యార్థుల లక్ష్యం


సివిల్స్ 24వ ర్యాంకర్ సాహితిని సత్కరిస్తున్న పాపా హోమ్ కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్: సివిల్స్ ఐఎఫ్‌ఎస్‌లో రాష్ట్ర స్థాయిలో 24వ ర్యాంక్ సాధించిన పూసపాటి సాహితి గురువారం పాపా హోమ్‌ను సందర్శించారు. అక్కడి పిల్లలతో కాసేపు ముచ్చటించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ఆమె మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, చక్కటి ప్రణాళికలతో ముందుకు వెళ్లి బంగారు భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇతర విషయాలు పక్కన పెట్టి కష్టపడి చదివితే అత్యున్నత శిఖరాలు చేరుకోగలరని సూచించారు. పాపా హోమ్ విద్యార్థుల కోసం రూ.10 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు సాహితీ అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు సంబంధించి ఏ విషయంలోనైనా తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సాహితీని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పాపా హోం ఉపాధ్యక్షుడు పంపాన వేంకటేశ్వరరావు, కార్యదర్శి వి.ఎస్.ప్రకాశరావు, సభ్యుడు పి.భాస్కర్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో నాలుగు రోజుల పాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు. ఈ వేడుకలు 24వ తేదీ శనివారం నుంచి 27 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ నాలుగు రోజులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, 26న కృష్ణాష్టమి సందర్భంగా వేకువజామున మంగళ హారతి, దర్శన హారతి, అఖండ హరినామ సంకీర్తన చేపడుతున్నామని తెలిపారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం


మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరిస్తున్న శివ గణేశ్వరరావు తదితరులు

పెదగంట్యాడ: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అహింస పిరమిడ్ స్పిరిచ్యువల్ ధ్యానకేంద్రం 14వ వార్షికోత్సవాన్ని ట్రస్ట్ నిర్వాహకుడు మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో నెల్లిముక్కులోని జీవీఎంసీ కల్యాణ మండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం బ్రహ్మర్షి పితామహ పత్రీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస పెట్టడమని చెప్పారు. మనికి ఓర్పు, సహనం రావాలంటే విధిగా ధ్యానం చేయాలని సూచించారు. అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం సేవలు అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ రేవు రత్నకుమారి, నామకులు కరణంరెడ్డి నరసింగరావు, పల్లా కార్తీక్, వంశీకిరణ్, ట్రస్ట్ సభ్యులు సత్యవతి పాల్గొన్నారు.

29న సామూహిక సత్యనారాయణ వ్రతం

గాజువాక: వాసవీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలోఈ నెల 29న నిర్వహించనున్న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం పోస్టర్‌ను గాజువాకలో గురువారం మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ఆవిష్కరించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాసవీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గాజువాక ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు గుండా శరత్‌చంద్ర గుప్త, నంబూరి జగన్నాథరావు, కులుకూరి మంగరాజు, సింగంశెట్టి సతీష్ కుమార్, చెక్క బంగార్రాజు, గునిశెట్టి అప్పల సత్యనారాయణ గుప్త, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి తదితరులు పాల్గొన్నారు.